హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు

● సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్ర ఈ నెల 23న జరుగనున్న సందర్భంగా చిక్కడపల్లి నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, అరుంధతీనగర్, సబర్మతీనగర్, గాంధీనగర్ లింక్‌బ్రిడ్జి వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి అశోక్‌నగర్ క్రాస్ రోడ్ వరకు రోడ్లపై ఎలాంటి చెత్తా చెదారాలు, మట్టి కుప్పలు, రాళ్ల రప్పలు లేకుండా పూర్తిగా ఎత్తివేశారు. ప్రతి ఏటా శోభాయాత్ర ఈ రోడ్డు ద్వారానే వెళ్తున్న క్రమంలో పోలీసులు పరిశీలించారు. శనివారం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ కమిషనర్ విక్రమ్‌సింగ్‌మాన్, తదితర పోలీసు అధికారులు వీహెచ్‌పీ నేత బాలస్వామి తదితరులు ఈ రోడ్డులో ప్రయాణించి శోభాయాత్ర వెళ్లడానికి అనువుగా ఉండేలా ఏర్పాట్లు పర్యవేక్షించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, మున్సిపల్ జోనల్ కమిషనర్, సర్కిల్ 15 ఎఎంవోహెచ్ మైత్రేయి పర్యటించి అన్ని ఏర్పాట్లు పరిశీలించారు.





ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో శోభాయాత్రరూట్‌ను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి
అశోక్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో శనివారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కవాడిగూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాలలో శనివారం రాత్రి శ్రీహనుమాన్ శోభాయాత్ర జరిగే ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 23న జరిగే శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను ప్రశాంతంగా జరిగేలా పాటించాలని పోలీసులు ప్రజలను కోరారు.

24న అన్నమయ్య సంకీర్తనా గానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సాహితీ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనాగానం నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంబీ రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మి తెలిపారు. చిక్కడపల్లిలో శనివారం సాయంత్రం వారు మాట్లాడుతూ ఈ నెల 24న సాయంత్రం 4 గంటలు త్యాగరాయ గానసభలో అన్నమయ్య సంకీర్తనాగానం ప్రారంభమవుతుందన్నారు. పద్మశ్రీ పురస్కారగ్రహీత డా.శోభారాజు, సంగీత సుధానిధి డీవీ మోహనకృష్ణకు ఆత్మీయ సత్కారం చేస్తామని తెలిపారు.



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాకు గౌరవం ఇస్తే చాలు

● స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ విద్యాసాగర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మాకు గౌరవం ఇస్తే చాలు ఎంత పని అయినా చేయగలం. ప్రేమను పంచగలమని స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ వీజేటీ విద్యాసాగర్ అన్నారు. శనివారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ సంస్థలో నవభారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భర్తను అభినందించే దినోత్సవం ఘనంగా జరిగింది. లయన్స్ డిస్ట్రిక్ట్ 1, 2 గవర్నర్లు కోటేశ్వరరావు, డా. జి. మహేంద్రకుమార్‌రెడ్డి, బి. వినయ్‌లను వారి భార్యలు లక్ష్మి, దీప, వనితలు సన్మానించారు.

కార్యక్రమంలో సీహెచ్ గోపాల్‌కృష్ణ, వినయ్, హర్ష, వనిత, డా. హిప్నో పద్మాకమలాకర్ తదితరులు పాల్గొన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ భార్యలు ఎంత కృతజ్ఞతతో ఉంటే మాకు అంతగా మంచిదన్నారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి: మహేందర్

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 50, దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉన్నప్పటికి కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ లేదని రానున్న ఎన్నికల అనంతరం ఏర్పడే కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లుపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దీనికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, నిఖిల్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లుపై మోదీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు.

నేడు కూడా సీఎస్‌సీ సెంటర్లు ఓపెన్

● జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ ట్యాక్స్‌పై 5 శాతం రెబెటుతో చెల్లించే వెసులుబాటు ఇంకా 10 రోజులు మాత్రమే ఉన్నందున ఆదివారం కూడా జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్, సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) తెరిచే ఉంటాయని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సెంటర్లు అందుబాటులో ఉంటాయని, ఇప్పటి వరకు 5 శాతం రిబెట్ పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, ఇప్పటి వరకు 4.50 లక్షల మంది రూ.3.70 కోట్లు చెల్లించారని, గతేడాది ఎర్లీ బర్డ్‌లో రికార్డుస్థాయిలో రూ.760 కోట్ల ఆస్తి పన్ను ఆదాయం వచ్చిందని కమిషనర్ తెలిపారు.

కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మినాజ్ ఉద్దీన్ హమేద్

ముషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మినాజ్ ఉద్దీన్ హమేద్ నియమితులయ్యారు. ఆయనకు మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మోసీన్ కురేషీ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మినాజ్ ఉద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలు కాంగ్రెస్‌కు మరింత దగ్గరయ్యేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిచే విధంగా అంకిత భావంతో పనిచేస్తానన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 200గ్రాముల గంజాయి, తూకం మిషన్, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు పలుచోట్ల నిఘా ఏర్పాటుచేశారు. ఈనెల 19న రాత్రి సమయంలో కృష్ణకాంత్ పార్కు సమీపంలో సులేమాన్, జి.ఆదిత్య వారికి అనుమానాస్పదంగా కనిపించా రు. అదుపులోకి తీసుకుని విచారించగా సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్ముతున్నట్లు వారు అంగీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడని నమ్మితే మోసం చేశాడు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బాల్య స్నేహితుడని నమ్మితే మాయమాటలతో మభ్యపెట్టి పలు దఫాలుగా డబ్బు తీసుకోవడమే కాక కులం పేరుతో దూషించాడని ఓ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈసీఐఎల్‌కు చెందిన ఓ యువతి చిన్నతనంలో రహ్మత్‌నగర్‌లో చదువుకుంది. ఆ సమయంలో యూసుఫ్‌గూడకు చెందిన జోగి శ్రీకాంత్‌తో పరిచయంకావడంతో స్నేహంగా మెలిగింది. 2022లో ఆ యువతి ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా చేరింది. తన నివాసానికి దగ్గరలో ఉన్న ప్రవీణ్‌తో స్నేహంగా ఉండేది. శ్రీకాంత్ కూడా ఈసీఐఎల్‌లో ఉద్యోగంలో చేరాడు. డబ్బులు అవసరం ఉందని శ్రీకాంత్ అడగటంతో యువతి ప్రవీణ్ వద్ద పలు దఫాలుగా రూ.5 లక్షలు తీసుకుని శ్రీకాంత్‌కు ఇచ్చింది. దాంతో పాటు 7 గ్రాముల బంగారం కూడా ఇచ్చింది. డబ్బు, బంగారం గురించి అడిగినప్పుడల్లా శ్రీకాంత్ దాటవేసేవాడు. గత సంవత్సరం నవంబర్ 18న శ్రీకాంత్ యువతిని తన సోదరుడు ధర్మేంద్ర ఇంటికి తీసుకువెళ్లి శారీరకంగా వాడుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేయడంతో కులం పేరుతో దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .



ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు పోలింగ్‌బూత్ కన్వీనర్ల జాబితాను అందజేస్తున్న భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, తదితరులు

కష్టపడి పనిచేసేవారికే బూత్ కన్వీనర్ పోస్టులు

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్టీకోసం క్రమశిక్షణతో పనిచేసే వారినే పోలింగ్ బూత్ కన్వీనర్‌లుగా నియమించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులకు సూచించారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో డివిజన్‌కు సంబంధించిన 51 పోలింగ్ బూత్‌ల కన్వీనర్ల జాబితాను ఎమ్మెల్యేకు ఆయన కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలప్పుడే నాయకులమంటూ ముందుకు వచ్చే నేతలను పక్కన పెట్టి పార్టీకోసం కష్టపడే వారికే బూత్ కన్వీనర్‌లు, పార్టీ పదవులను అప్పగిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల అధ్యక్షులు ప్రతి బస్తీ కాలనీ నుంచి పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి పోలింగ్ బూత్ జాబితా తయారు చేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటీ రాష్ట్రనాయకుడు రహీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్ తదితరులు

ఎన్డీయే కూటమి అత్యధిక సీట్లను గెలుస్తుంది

● నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్ .

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో భాగస్వాములుగా అత్యధిక సీట్లను గెలుచుకోవడం తథ్యమని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌జాదవ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడంలో అధికార పార్టీ విఫలమైందన్నారు. అనుభవం లేని నాయకులు అధికారంలోకి రావడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బేషద్, వేణుగోపాల్, రామాచారి, విఠల్‌నాయక్, మురళీధర్‌దేశ్‌పాండే, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌టీ కాలనీకి చెందిన రాకేష్ కిరణ్(37) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి 4నెలల క్రితం వివాహమైంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం, చిట్టీల వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో అప్పులు చేశాడు. తీర్చలేక ఇంట్లో విషం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అధిక వడ్డీకి అప్పు ఇచ్చిన వారి వేధింపులవల్లే కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తెలిపారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు పోయటంలో ఆలస్యం చేశారన్న కోపంతో ఓ వ్యక్తి బంక్ సిబ్బందిపై దాడి చేశాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్‌కు వచ్చిన బంటి వాహనంలో పెట్రోల్ పోయమన్నాడు. భోజనానికి వెళుతున్నానని, పక్కనున్న మరో ఉద్యోగి వద్దకు వెళ్లాలని సనోజ్ అనే యువకుడు చెప్పాడు. ఆగ్రహించిన బంటి నేను బోరబండ రౌడీనని, నేను అడిగితే పెట్రోల్ పోయవా అంటూ సనోజ్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన మరో ఉద్యోగి పవన్‌పై కూడా దాడి చేశాడు. బంక్ మేనేజర్ వసంత్‌కుమార్‌తో కలిసి బాధితులు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా యువకుడిపై..

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ యువకుడిపై ముగ్గురు దాడి చేశారు. జవహర్‌నగర్‌లో నివాసముండే చరణ్‌తేజ్ ఈ నెల 18న అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ అనిల్, అతని అల్లుడు అరుణ్, అతడి తండ్రి అంతయ్య అకారణంగా చరణ్‌తేజ్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హోరుగాలి కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న విప్లవకవి నిఖిలేశ్వర్ తదితరులు

హోరుగాలి కవితా సంపుటి ఆవిష్కరణ

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి కేంద్రంగా సాహిత్యం వస్తున్న తరుణంలో సామాజిక దృక్పథంతో సాహిత్యం రావాలని ప్రముఖ విప్లవకవి నిఖిలేశ్వర్ అన్నారు. హోరు గాలి కవితా సంపుటి ఆవిష్కరణ శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకాలుగా చీలిపోయి ఉన్న సమాజానికి శాంతారావు తనదైన దిశానిర్దేశం చేశారని అన్నారు. వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ సమకాలీన ఘటనలకు, పరిణామాలకు అనివార్య పర్యవసానం, తన సుదీర్ఘ ప్రజా జీవితంలో ఎదురైన అనుభవాలను ఆవిష్కరింపచేశారని అన్నారు. నవ తెలంగాణ సంపాదకులు ఆర్. సుధాభాస్కర్ మాట్లాడుతూ ప్రజలు నడుస్తున్నారు చరిత్ర పొడవునా అంటూ కాలంతో పాటు తానూ నడుస్తూ తన వ్యాఖ్యానాలను కవితలుగా ఆవిష్కరింపచేశారని అన్నారు. లౌకిక ప్రజాస్వామ్య సమాజాన్ని కోరుకునే వ్యక్తి శాంతిరావు అని అన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆనంతోజు మోహనకృష్ణ, సలీమ, నర్సింహ, రేఖ, కొండా రవీంద్ర, ముజాహిదీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగలకు న్యాయం చేయాలని ధర్మదీక్ష చేస్తున్న తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కన్వీనర్ కిరణ్‌కుమార్ మాదిగ

మాదిగలకు కాంగ్రెస్ అన్యాయం చేసింది

● మహాకూటమి కన్వీనర్ కిరణ్‌కుమార్ మాదిగ

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు ఇవ్వకుండా అన్యాయం చేసిందని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి కన్వీనర్ పోకల కిరణ్‌కుమార్ మాదిగ ఆరోపించారు. మాదిగలకు జనాభా ప్రాతిపదికన వరంగల్ పార్లమెంట్ సీటుతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నిక సీటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాగ్‌లింగంపల్లిలోని మహాకూటమి కార్యాలయంలో శనివారం మాదిగల ధర్మదీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మాదిగలకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు చట్టసభలలోకి వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీట్లు ఇవ్వకుండా అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మాదిగలను మోసం చేసిందని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయి తప్పా రాజ్యాంగపరంగా తమకు రావాల్సిన రిజర్వేషన్లు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేసే పార్టీలకు గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల మహాకూటమి నేతలు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

● ఉత్తర్వులు జారీచేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహవీర్ జయంతి సందర్భంగా గ్రేటర్‌లో ఆదివారం మటన్, చికెన్, ఫిష్, బీఫ్ షాప్‌లు మూసివేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్‌ఎంసీ ఆదేశాలు, నిబంధనలు దుకాణ నిర్వాహకులు పాటించాలన్నారు.

నేటి యూపీఎస్సీ పరీక్షకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలు-2024కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్స్ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని, బస్టాపుల్లో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్‌స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కోఠి-9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్- 9959226154 కమ్యూనికేషన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

గ్రేటర్‌లో ఎండలు తగ్గడంతో ఆర్టీసీ బస్ ట్రిప్పులు యథాతథంగా నడుపుతున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ట్రిప్పుల సంఖ్య తగ్గించాలనుకున్నా... వాతావరణం చల్లబడంతో ట్రిప్పులను యథాతథంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,839 బస్సులతో రోజూ 30 వేల బస్ ట్రిప్పులతో 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుందన్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు ఉగాండా దేశ యువతుల అరెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉగాండా దేశం నుంచి హైదరాబాద్‌కు వ్యాపారం, వైద్యం కోసం వచ్చి ఆన్‌లైన్ ద్వారా విటులను రప్పించుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు యువతులను నల్లకుంట పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని స్వదేశానికి పంపించారు. శనివారం నల్లకుంట పీఎస్‌లో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, ఓయూ డివిజన్ ఏసీపీ జగన్, నల్లకుంట సీఐ జగదీశ్వర్‌రావుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఉగాండాకు చెందిన ముగ్గురు యువతులు కొంత కాలం కితం ఇద్దరు యువతులు వ్యాపారం, మరొకరు మెడికల్ వీసాలపై నగరానికి వచ్చి నల్లకుంటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఉగాండాలో ఉంటున్న వీరికి సంబంధించిన కేన్ అనే వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన విటులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు తీసుకుని ఈ ముగ్గురు యువతుల వద్దకు వారిని పంపిస్తూ వ్యభిచారానికి పాల్పడుతున్నారు. వీరు నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలుసుకున్న ఓ వ్యక్తి నల్లకుంట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వారు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ వెబ్‌సైట్, ఫోన్ నంబర్ల ద్వారా వివరాలు తెలుసుకుని మహిళా ఎస్ఐ రమాదేవి ద్వారా వారిపై నిఘా పెట్టించారు. పక్కా సమాచారంతో జనవరి 19వ తేదీన ఆ ముగ్గురు యువతులతోపాటు ఓ విటుడిని అరెస్ట్ చేశారు. విటుడిని రిమాండ్‌కు తరలించగా ఆ ముగ్గురు యువతులను ప్రజ్వల హోమ్‌లో పెట్టి వారి సహకారంతో వారిని ఉగాండా దేశానికి సొంత ఖర్చులతో పంపించారు. విదేశానికి చెందిన వీరు అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నట్లు లభించిన ఆధారాలను న్యాయపరమైన సలహాలు తీసుకుని వారిని స్వదేశానికి పంపించే చర్యలు చేపట్టిన నల్లకుంట పోలీసులను నగర పోలీస్ కమిషనర్ అభినందించినట్లు డీసీపీ గిరిదర్‌రావు తెలిపారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, ఏసీపీ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మాలలను అణచివేయాలనే లక్ష్యంతో బీజేపీ కుట్రకు పాల్పడుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య ఆరోపించారు. రాష్ట్రంలోని మూడు పార్లమెంట్ స్థానాలు మినహా కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలోనూ మాలలకు ఒక్క సీటు కూడా బీజేపీ కేటాయించలేదని ఆయన ధ్వజమెత్తారు. శనివారం నల్లకుంట డివిజన్ సత్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి బీజేపీని నమ్ముకున్న మాలలను ప్రణాళిక ప్రకారం అణచివేసే కుట్ర జరుగుతుందన్నారు. మాల సామాజిక వర్గం నేతలు ఈ వాస్తవాన్ని గుర్తించి పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, ఉపాధ్యక్షులు తాలుక రాజేష్, గోకుల్ కల్యాణ్, కె. అనిల్‌కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్) ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఫ్యాషన్ డజైనింగ్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాముయాదవ్ తెలిపారు. శనివారం సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులలో చేరేందుకు మే 19వ తేదీన కాచిగూడలోని ఇనిస్టిట్యూట్‌లో ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9030610033, 9849167839 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

చిక్కడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి వేల కోట్లు తెచ్చిన మచ్చలేని నేత కిషన్‌రెడ్డిని సికింద్రాబాద్ ఎంపీగా గెలిపించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం డివిజన్‌లోని 132 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టి మే నెల 13న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పార్టీ నేతలు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి అండగా నిలవాని : గీతామూర్తి

బర్కత్‌పుర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె. గీతామూర్తి కోరారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ అవినీతి కుంభకోణాలలో కూరుకుపోయిందన్నారు. ఈ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.



కోచింగ్ సెంటర్ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోచంపల్లి రమణారావు, తదితరులు

పేద బ్రాహ్మణ విద్యార్థులకు చేయూత

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు చేయూత కల్పించేందుకు బ్రాహ్మణ సంఘాలు ముందడుగు వేయాలని శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోచంపల్లి రమణారావు కోరారు. శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్, ఆఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 15 మంది పేద బ్రాహ్మణ విద్యార్థుల ఉద్యోగాల పరీక్ష కోచింగ్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్, నగదు ఆర్థిక సాయం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణ విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కోచింగ్ సెంటర్ నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పోచంపల్లి రమణారావు, మంత్రి సునీల్, దేవులపల్లి రంగారావు, దేశ్‌ముఖ్ రమాకుమార్, దేవులపల్లి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేసిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెబుతాం

● యాదగిరి ముదిరాజ్

నల్లకుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలను అన్యాయం చేసిన రాజకీయ పార్టీలకు గుణపాఠం చెబుతామని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ హెచ్చరించారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో పెట్టి అమలు చేసే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల నవీన్‌ముదిరాజ్, సలహాదారులు తూర్పు రాంచందర్‌రావు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నగర అధ్యక్షుడు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.